ప్రజాశక్తి

బుధవారం 6 ఆగస్టు 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ముట్టడికి తరలివస్తున్న నాయకులు, ప్రజలు

స్మార్ట్ మీటర్లపై ప్రజాగ్రహం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ధర్నాలు



పరవాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన మంగళవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. వీటిలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తమపై బిల్లు భారాలు మోపొద్దని పెద్ద పెట్టున నినదించారు. అదానికి లాభం చేకూర్చేందుకు తమను బలిపశువులుగా చేయొద్దని అన్నారు. నిర్ణయాన్ని మార్చుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురుద్వార సమీపంలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు. (వార్తలు 5లో..)

ప్రజల ప్రాణాలు పట్టవా ?

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా బల్క్ డ్రగ్ పార్కుపై ముందుకెళ్తున్న ప్రభుత్వం
- నేడు నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ
- పోలీసు పహారా నడుమ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు
- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు గృహ నిర్బంధం

ప్రజాశక్తి - నక్కపల్లి

పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును ప్రజలు వ్యతిరేకిస్తున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదు. కార్పొరేట్, ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసు పహారా నడుమ ఈ కార్యక్రమాన్ని నడిపించేలా వ్యూహం రచించారు. బల్క్‌డ్రగ్ పార్కు బాధితుల తరుపున పోరాడుతున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకుల కదలికలపై పూర్తి నిఘా పెట్టారు. అనకాపల్లి దరి కొప్పాకలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావును గృహ నిర్బంధం చేశారు.



నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ కోసం సాగుతున్న ఏర్పాట్లు

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు క్రమంలో ప్రభుత్వం భూ సేకరణ చట్టం 2013 సహా అన్ని నిబంధనలకూ చాపచుట్టేసింది. బల్క్ డ్రగ్ పార్కు ప్రభావిత ప్రాంతాల్లో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. నక్కపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు మిగతా 2లో..

కల్యాణపులోవ నీరు విడుదల

వార్త 8లో..

జగదాంబ థియేటర్ అధినేత రాంబాబు కన్నుమూత

వార్త 7లో..

మెరుగైన సేవలే లక్ష్యం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల మన్ననలు పొందే రీతిలో పౌర సరఫరాల శాఖ ద్వారా మెరుగైన సేవలందించాలని, వారి సంతృప్తే కొలమానంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అవగతం చేసుకొని నడుచుకోవాలని, సమన్వయం వహించాలని సూచించారు. మంగళవారం విశాఖ కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో ఆయన వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీపం-2 పథకం అమలు, బియ్యం పంపిణీ, రేషన్ బియ్యం అక్రమ రవాణా, తూనికలు కొలతలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా భారం అయినప్పటికీ ఎండియులను తొలగించి రేషన్ దుకాణాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వాటి ద్వారా ప్రజలకు నాణ్యమైన సరుకులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీపం పథకం ద్వారా మిగతా 2లో..

నేడు జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలు

- వెంటనే ఫలితాలు వెల్లడి
- ఓటింగ్‌కు సిపిఎం దూరం
- టిడిపి తీరుపై జనసేనలో అసంతృప్తి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, **ఎంవిపి.కాలనీ :** జివిఎంసి స్థాయీ సంఘ సభ్యుల ఎన్నికలు బుధవారం జరుగనున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఈ ఎన్నికల బరిలో 20 మంది ఉన్నారు. 10 మంది స్థాయీ సంఘం సభ్యుల కోసం జరుగుతున్న ఈ ఎన్నికలకు సంబంధించి కార్పొరేటర్లకు అవగాహన కల్పించినట్టు జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ పేర్కొన్నారు. మంగళవారం జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జివిఎంసి స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్లు సంయుక్తంగా స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికలపై ఓటింగ్ వేసే విధానాన్ని కార్పొరేటర్లకు వివరించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రజల ప్రాణాలు పట్టవా ?

చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాంత మత్స్యకారులు, భూ సేకరణ ప్రభావిత గ్రామాల ప్రజలు, సిపిఎం, వైసిపి నేతలు ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని అనేక రూపాల్లో నిరసనలు తెలిపారు. వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, పెద తీనార్ల, ఉపమాక, సిహెచ్‌ఎల్.పురం, ఎన్.నరసా పురం, ఎన్.రాయవరం మండలంలోని గుడివాడ గ్రామాల్లో మొత్తం 1270.80 ఎకరాల విస్తీర్ణంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. అదనంగా మరో 800 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదనపు భూసేకరణ చేపట్టొద్దని ఇప్పటికే నక్కపల్లి మండలంలో జానకయ్యపేట, ఎస్.రాయవరం మండలంలో గుర్రాజుపేట గ్రామానికి చెందిన రైతులు ఆందోళనలకు దిగారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ కాలుష్యం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నామని, మత్స్య సంపద నశించి పోవడంతో ఉపాధి కోల్పోయామని, ఇప్పుడు బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే పూర్తిగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. వారి గోస ప్రభుత్వం చెవికెక్కడం లేదు.

నాడు వ్యతిరేకించి.. నేడు స్వాగతించి..

బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కోసం బుధవారం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. గతంలో కాకినాడ ప్రాంతం తొండంగి ప్రాంతంలో దివీస్, బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి అనుమతులు ఇస్తే ఆ అనుమతులు రద్దు చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, సీనియర్ నాయకులు యనమల రామకృష్ణుడు కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారన్నారు. స్పందించిన చంద్రబాబు వాటిని ఏర్పాటు చేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి మరలా లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. అటువంటిది పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఎందుకు ఇక్కడ బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయడం లేదని ప్రశ్నించారు. కాకినాడ ప్రాంతానికి ఒక న్యాయం, నక్కపల్లి ప్రాంతానికి మరొక న్యాయమా అని ప్రశ్నించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మౌనం దారుణమన్నారు. పోలీసులు పహారాలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రాము, కె.బుజ్జి, ఎం.శ్రీను, జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు నిర్మాణం వద్దే వద్దు : కె.లోకనాథం

నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం తలపెట్టొద్దని, భూ సేకరణను నిలుపుదల చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అనకాపల్లి కలెక్టర్‌కు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాశారు. బల్క్ డ్రగ్ పార్కుతో జరిగే నష్టాన్ని వివరించారు. బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటుకు తమ భూమిని అప్పగించడానికి ప్రజలు ఇప్పటికే ఏకగ్రీవంగా తమ అయిష్టతను వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా దుందుడుకుగా ముందుకెళ్తోందని తెలిపారు. బల్క్ డ్రగ్ పార్కుతో మత్స్యకారుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు.

మెరుగైన సేవలే లక్ష్యం

ఫేజ్ -1లో కోటి మందికి లబ్ధి చేకూర్చామని, ఫేజ్ -2లో ఆ సంఖ్య 95 లక్షలుగా ఉందని, ఫేజ్ -3లో అన్ని రకాల సాంకేతిక సమస్యలను అధిగమించి అర్హులందరికీ పథక ఫలాలు అందేలా సమిష్టి కృషి చేస్తామని అన్నారు. తప్పు చేసిన డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ నగదు జమకాని పక్షంలో అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ప్రయోజనార్థం గత సీజన్‌లో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి, రూ.12 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. స్థానికంగా పండే ధాన్యాన్ని, మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించి, ప్రపోజల్స్ పంపించాలని శ్రీకాకుళం, విజయనగరం జెసిలను ఆదేశించారు. రేషన్ దుకాణాల వద్ద పూర్తి వివరాలతో కూడిన ఫ్లెక్సీలు పెట్టాలని, క్యూఆర్ కోడ్ సాయంతో ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, విశాఖ జెసి కె.మయూర్ అశోక్, జిసిసి ఎమ్‌డి కల్పనా కుమారి, అనకాపల్లి జెసి ఎం.జాహ్నవి, విజయనగరం జెసి సేతుమాధవన్, శ్రీకాకుళం జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విశాఖ డిఎస్ఒ వి.భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి..) స్థాయి సంఘం సభ్యుల ఎన్నికలు జరుగుతాయని, ఓటు హక్కును వినియోగించుకునే కార్పొరేటర్లు తప్పనిసరిగా తమ వెంట ఫోటో ఐడెంటీ కార్డును తీసుకురావాలని, దానిని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ముందు పోలింగ్ స్టేషన్ బయట ఉన్న ఓటర్ ఐడెంటిఫికేషన్ అధికారికి చూపించిన పిదప ఓటర్ స్లిప్పు తీసుకొని పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎటువంటి పెన్నులు, పెన్సిళ్లు, మార్కర్, పిన్నులు, డిజిటల్ వాచీలు, సెల్ ఫోన్లుతో పాటు ఏ ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు అనుమతించబడవని, వాటిని ప్రత్యేక కౌంటర్ వద్ద జమ చేయాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థికి ఎదురుగా ఉన్న గడిలో ఓటర్ మార్కును వేయాలని, స్థాయి సంఘంలో 10 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉన్నందున ఒక ఓటరు పది ఓట్లు మాత్రమే వేయాలని, అంతకన్నా ఎక్కువ ఓట్లు వేసిన ఎడల ఆ బ్యాలెట్ చెల్లదని అన్నారు. స్థాయి సంఘం ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఉదయం 9: 45 నిమిషాలకు బ్యాలెట్ బాక్సులు సీల్ వేసే కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. బుధవారమే ఫలితాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కార్యదర్శి బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌కు సిపిఎం దూరం

స్థాయి సంఘం ఎన్నికల్లో ఏ పార్టీనీ సిపిఎం బలపరచడం లేదు. జివిఎంసిని గత వైసిపి, నేటి టిడిపి, జనసేన, బిజెపి కూటమి పాలకవర్గం పూర్తిగా అవినీతిమయం చేశాయని సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. గత మేయర్ ఎన్నికలో కూడా కార్పొరేటర్లను మార్కెట్‌లో సరుకులుగా కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మొదటి నుండి సిపిఎం అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుతోందని తెలిపారు. ఈ పరిస్థితిలో పార్టీ జిల్లా కమిటీ ఆదేశానుసారంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏ పార్టీనీ బలపరచడం లేదని, ఓటింగ్‌లో పాల్గొనడటం లేదని ఆయన తెలియజేశారు.

కూటమి తీరుపై మూర్తియాదవ్ వ్యాఖ్యలు

స్థాయి సంఘ ఎన్నికల్లో ఈసారీ జనసేనకు మొండి చేయి చూపడంపై ఆ పార్టీ కార్పొరేటర్ మూర్తియాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 14 మంది జనసేన కార్పొరేటర్లలో ఒక్కరికైనా స్టాండింగ్ కమిటీలో అవకాశం ఇవ్వకుండా టిడిపి వ్యవహరిస్తోందన్నారు. ఈ క్రమంలో తాను ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం అదే క్రమంలో ఆటో డ్రైవర్లనూ ఆదుకోవాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆటోడ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన మిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తానన్న రూ.15 వేలు ఇవ్వాలన్నారు. సబ్సిడీతో పెట్రోలు, డీజిల్, గ్యాస్ అందజేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 11న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కర్రి గణేష్, కోశాధికారి కె.రాము, కెవి.రమణ, బాబ్జీ, ఆలీ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : గురుద్వార్ జంక్షన్ దగ్గర ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఎపి ఆటో డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు.

పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వేదికగా పోలీస్ బ్యారక్స్ గ్రౌండ్‌లో ఈ నెల 9 న ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి 6 వ జూనియర్, సబ్ - జూనియర్ పారాఅథ్లెటిక్స్ పోటీల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో పోటీలు నిర్వహించనున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం వేదికగా జరిగే ఈ పోటీలకు అన్ని జిల్లాల నుండి పారా క్రీడాకారులు రావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికవాలని ఆకాంక్షించారు.

జిఒ 137ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విజయవాడలో ఆర్‌టిసికి చెందిన కోట్ల విలువైన స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ137ను రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టిసి ఆస్తులు కాపాడుకునేందుకు ఆర్టిసిలో అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఆర్టిసి ఆస్తులు ప్రైవేటు వ్యాపారవేత్తలకు దారాదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ఖండించాలన్నారు.

భవన నిర్మాణాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -మధురవాడ : భవన నిర్మాణదారులు ఇచ్చిన ప్లాన్ ప్రకారం నిర్మాణ పనులు చేపట్టేలా పూర్తి అవగాహన కల్పిస్తే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇలాంటి ఫిర్యాదులు రావని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. జివిఎంసి జోన్-2 కార్యాలయంలో మంగళవారం జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేతన్‌గార్గ్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం భవనాల నిర్మాణం చేపట్టేలా నిర్మాణదారులకు అవగాహన కల్పించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. జివిఎంసి స్థలాలను గుర్తించి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ప్లానింగ్ కార్యదర్శులు వారు చేపట్టే పనులపై శ్రద్ధ వహించి విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు వార్డు సచివాలయాల పరిధిలో రోజూ పర్యటిస్తూ ఆక్రమణలు, అనధికార కట్టడాలను నిరోధించడంతోపాటు ప్లాన్ ప్రకారం నిర్మాణ పనులు చేపడుతున్నది లేనిది పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను గుర్తించాలని చెప్పారు. భవన నిర్మాణదారులు భవనానికి గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుపై వ్యర్థాలు, మెటీరియల్ వెయ్యకుండా చూడాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాలువలు, గెడ్డలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆస్తి, నీటి పన్నులు, అద్దెలు, ఆశీలు శత శాతం వసూలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో వారు నివసించేందుకు నిరాకరిస్తే అటువంటి వారి జాబితాను తయారుచేసి వారి నుండి గృహాన్ని ఉపసంహరించుకునే పత్రాన్ని తీసుకోవాలన్నారు. వార్డులో ఖాళీ స్థలాలను గుర్తించాలని, ప్రతి వార్డులో ఒక పార్కు ఏర్పాటు చేసేందుకు కొత్త ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డుల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, శాంతిరాజు, సుధాకర్, ఉప కార్య నిర్వాహక ఇంజినీర్లు సీతారామరాజు, అన్నమ నాయుడు, ఏసిపి తిరుపతిరావు, టిపిఒ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

తీర ప్రాంత రక్షణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రంలో కోస్తాంధ్ర తీర ప్రాంత రక్షణకు చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర అటవీశాఖ సలహాదారు, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి పి.మల్లికార్జునరావు తెలిపారు. రెండు రోజుల పాటు విశాఖ ఫారెస్ట్ సర్కిల్ సందర్శనలో భాగంగా ఆయన మంగళవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను, కంబాలకొండ ఎకో టూరిజం పార్కును సందర్శించారు. ఆయా పార్కుల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలు గురించి అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. విశాఖ రీజియన్‌లో అడవులు సంరక్షణ, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా తీర ప్రాంతాన్ని తీర్చదిద్దడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా కోస్తాంధ్రలో 12 జిల్లాల్లో ఉన్న 974 కిలోమీటర్ల కోస్తాంధ్ర తీర ప్రాంతంలో సుమారు 600 కిలోమీటర్లలో క్షీణించిన పచ్చదనాన్ని పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతమంతా 2 లక్షల తాటి విత్తనాలు నాటనున్నట్టు తెలిపారు. దీంతో పాటు అడవుల సంరక్షణలో భాగంగా ఎలాంటి మొక్కలు నాటాలో ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలో పంటలను నాశనం చేస్తున్న ఏనుగుల నుంచి రక్షించడానికి రెండు కుంకి ఏనుగులను రెండు నెలల్లో తీసుకు రానున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో విశాఖ రీజియన్ సిఎఫ్ మైథీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, డిఎఫ్ఒలు, సబ్ డిఎఫ్‌లు పాల్గొన్నారు.


క్షయ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న సమత

క్షయ రోగులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి- మధురవాడ : పిఎం పాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సమత ఆధ్వర్యాన టీబీ పేషెంట్లకు పౌష్టికాహారం ప్యాకెట్లను సరఫరా చేశారు. నేషనల్ అల్యూమినియం (నాల్కో) కంపెనీ, నేషనల్ అల్యూమినియం లిమిటెడ్ కంపెనీ జిల్లాలో కొంతమంది టీబీ పేషెంట్లను దత్తత తీసుకొని ఈ పౌష్టికాహారం ఇస్తున్నట్లు డాక్టర్ సమత తెలిపారు. మధురవాడ టీబీ యూనిట్‌లో సుమారుగా 8 మందికి పౌష్టికాహారం అందించారని, ఉచితంగా ఆరు నెలల పాటు మందులను ప్రభుత్వమే ఇస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుజానే, ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం, సురేష్, కృష్ణ ఆశా కార్యకర్త హాజరయ్యారు.

ఎట్టకేలకు విద్యుత్ స్తంభం మార్పు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస సర్వీస్ రోడ్డు నుంచి శివాలయం వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి ఎట్టకేలకు అడ్డంకులు తొలిగాయని చెప్పవచ్చు. సుమారు రూ. కోటితో రోడ్డు నిర్మాణం ప్రారంభించగా విద్యుత్ స్తంభం ఆటంకంగా ఉండడం, ఆక్రమణలు తొలగించకపోవడంతో కొద్ది రోజులుగా రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిన విషయం విదితమే. దీంతో స్థానికులు చోడిపిల్లి సాయి జై శంకర్ స్పందించి జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని సంబంధిత అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు రోడ్డు నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని పలు దఫాలుగా వినతిపత్రాలు అందజేశారు. ఇందుకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాన్ని మార్చారు.


మార్చిన విద్యుత్ స్తంభం

మానసిక ఆరోగ్యంపై అవగాహన


ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు ఎంఎఫ్‌సి యుపి పాఠశాలలో 6,7,8 తరగతుల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. మెంటల్ హెల్త్ ఎబిలిటీస్ ఎలా మెరుగుపర్చుకోవచ్చు అనేది విద్యార్థులకు సమగ్ర శిక్ష కౌన్సిలర్ దొడ్ల ఝాన్సీరాణి వివరించారు. మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మానసిక వికాసం పెంపుదలకు దోహద పడేలా పలు కృత్యాల ద్వారా ఆచరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మరగడ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాదం తనిఖీ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు అప్పన్న నిత్య అన్న ప్రసాదాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడి, అన్న ప్రసాదం రుచి, నాణ్యత గురించి ఆరా తీశారు. భక్తులకు వడ్డించే సాంబార్, మజ్జిగ, కూరలను ప్రత్యేకంగా పరిశీలించారు. అన్న ప్రసాదం నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులకు స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్ర కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఒకటో జోన్ పరిధిలోని 50 మంది పారిశుద్ధ్య కార్మికులకు మంగళ వారం చీరలు పంపిణీ చేశారు. భీమిలి మండలం తాళ్లవలస గ్రామంలోని బాలల సంరక్షణా కేంద్రంలో ఉన్న 25 మందికి అల్పాహారాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక టిడిపి కార్యాలయంలో నరేంద్ర తన పుట్టిన రోజు వేడుకలను పార్టీ అభిమానులు, కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. పలువురు పుష్ప గుచ్ఛాలు అందజేసి, గజ మాల వేసి అతనికి శుభాకాంక్షలు తెలిపారు. నరేంద్రను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో తాళ్లవలస పంచాయతీ ఉప సర్పంచ్ బుద్ధరాజు సత్యనారాయణరాజు, జివిఎంసి రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, పార్టీ నాయకులు గాడు సన్యాసినాయుడు, కనకల అప్పలనాయుడు, కాసరపు ఎల్లాజీ, జి.పోలిరాజు, గరే సదానంద తదితరులు ఉన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ నరేంద్రకుమార్

నేరాలు ఘోరాలు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మార్టూరు గ్రామంలో ఒక ఇంటిలో దొంగతనం చేసిన కేసులో నిందితుడు చందక గోపిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.సుధాకర్ చెప్పారు. అచ్చుతాపురం గ్రామానికి చెందిన చందక గోపి సోమవారం రాత్రి 12 గంటల సమయంలో మార్టూరు గ్రామంలో దొంగతనానికి పాల్పడ్డాడు. ఇంటిలో గడియ పెట్టి నిద్రిస్తున్న సమయంలో గోపి గడియ విరగ్గొట్టి ఇంట్లోని బెడ్ రూమ్‌లో పడుకున్నా వ్యక్తుల వద్ద నుండి 6 సెల్ ఫోన్లు, రూ.5000 నగదును దొంగలించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కానిస్టేబుల్ బంగారురాజు, వెంకటేష్, హెూంగార్డు రామకృష్ణ నిందితుడు గోపీని పట్టుకున్నారు. నిందితుడు వద్ద నుండి దొంగిలించబడిన ఆరు సెల్ఫోన్లో, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మెకానిక్‌పై దాడి కేసులో వైసిపి నేత అరెస్ట్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మెకానిక్‌పై దాడి ఘటనలో వైసిపి నాయకుడు తేనేటి సూర్యచంద్రరావు (జాన్) ను అరెస్ట్ చేసినట్లు టౌన్ సిఐ గోవిందరావు మంగళవారం విలేకరులకు తెలియజేశారు. టౌన్ సి ఐ గోవిందరావు తెలిపిన వివరాలు ప్రకారం బైక్ రిపేర్ చేయించుకున్న తర్వాత, మెకానిక్ రుత్తల శ్రీను డబ్బులు అడిగిన సందర్భంలో వైసిపి నాయకుడు జాన్ తీవ్ర ఆగ్రహానికి గురై, మెకానిక్ శీనుపైదాడి చేయగా, అతని కంటిపై తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సీపట్నం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నిందితుడు జాన్‌ను అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరచగా కోర్టు అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాల విద్యార్థి అదృశ్యమైనట్లు పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... విజయనగరం జిల్లా డెంకాడ మండలం బొడ్డవలస గ్రామానికి చెందిన సిగిడం నందకిషోర్ మధురవాడలో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. సోమవారం సాయింత్రం హాజరు తీసుకునే సమయంలో విద్యార్థి కనిపించలేదు. హాస్టల్ సూపర్‌వైజర్ ప్రవీణకుమార్ చుట్టపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

తర్లువాడలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లవాడ గ్రామంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా గత 14 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, బంక సత్యం, శ్రీనివాసరావు, మజ్జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గదులు.. ఐదు తరగతులు..

పాత మధురవాడ ప్రభుత్వ పాఠశాల దుస్థితి



ఒకే గదిలో రెండు తరగతులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి పరిధి పాత మధురవాడలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు చాలీచాలని తరగతి గదులతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పాత మధురవాడలో 2006-07 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలను అధికారులు అతి తక్కువ మంది విద్యార్థులతో ప్రారంభించారు. కాల క్రమంలో ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 100 మంది విద్యార్థులు చేరారు. ఈ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్కో గదిలో రెండేసి తరగతులు చొప్పున నాలుగు తరగతులు, వరండాలో ఒక తరగతిని కలిపి మొత్తం ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాడు- నేడు పథకం కింద రూ.16 లక్షలతో పైఅంతస్తు నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. పైన కాలమ్స్ కట్టి వదిలేశారు. కాలక్రమేనా విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు చాలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకొని అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం : ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలలో సమస్యలపై ప్రధానోపాధ్యాయుని సంప్రదించగా తరగతి గదులతో పాటు మరుగుదొడ్ల సమస్యకూడా ఉందని, ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయులు జె.అప్పలనాయుడు తెలిపారు. తొందర్లోనే సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్టిఎల్ డైరెక్టర్

ఎన్ఎస్టిఎల్లో 160 మంది రక్తదానం

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఎన్ఎస్టిఎల్లో 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని డిఆర్డిఒ ప్రధాన కార్యాలయంలో ఎన్ఎస్టిఎల్ ఉద్యోగులు 160 మంది రక్తదానం చేశారు. ఎన్ఎస్టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహాం వర్గీస్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ఎస్టిఎల్ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. సామాజిక సేవా కమిటీ చైర్మన్ జిఎస్విఎస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ, వైద్య అత్యవసర పరిస్థితులకు తక్షణమే అందుబాటులో ఉండేలా వివిధ సందర్భాల్లో రక్తదానం చేశామని గుర్తుచేశారు. ఎఎస్రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పట్నాయక్, శాస్త్రవేత్తలు, సిఇ యూనియన్ అధ్యక్షుడు అకిరి సునీల్, వర్క్స్ కమిటీ కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బిఆర్బి నాయుడు

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ పరిధి ప్రకృతివానిపాలెంలో రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో సిసి కాలువ నిర్మాణ పనులకు సర్పంచ్ బిఆర్బి.నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మేలు కలిగే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, బంకు రాజు, వైస్ సర్పంచ్ పిల్లా సూరిబాబు, వార్డు సభ్యుడు ఎ.ఆదినారాయణ, పల్లె రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి- భీమునిపట్నం : బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఎస్సి ద్వితీయ సంవత్సరం విద్యార్థి పల్లంటి దుర్గాప్రసాద్ ఎంపికైనట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ పి.గౌరీశంకర్ మంగళవారం తెలిపారు. గత నెల 27, 28 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్లో జరిగిన 10 కిలోమీటర్ల రేస్ వాకింగ్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ మేరకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థి దుర్గాప్రసాద్ను ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ బి.ప్రసాదరావు, హెచ్ఒడి డాక్టర్ కె.విద్యాసాగర్, ఇతర అధ్యాపకులు ఉన్నారు.

ప్రణవ్ గోపాల్ను కలిసిన అశోక్ చక్రవర్తి

ప్రజాశక్తి -తగరపువలస : విఎంఆర్డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్గోపాల్ను జివిఎంసి రెండో వార్డు టిడిపి నాయకులు, సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి మంగళవారం విఎంఆర్డిఎ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ పరంగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రణవ్ గోపాల్ను శాలువాతో సత్కరించారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

ప్రజాశక్తి -గాజువాక : పెన్షన్దారులకు కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని సిఐటియు నాయకులు ఎన్.రామారావు డిమాండ్చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఆల్ పెన్షన్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మినిమం పెన్షన్ అమలు చేయకుండా, గత పదేళ్ల నుంచి కాలయాపన చేస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ట్రైన్ చార్జీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని, రైస్ కార్డు ఇవ్వాలని కోరారు. తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ నాయకులు పులి రమణారెడ్డి మాట్లాడుతూ, హయ్యర్ పెన్షన్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా అమలు కాలేదన్నారు. డబ్బులు కట్టిన వారందరికీ ఎరియర్స్ చెల్లించాలని కోరారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంధు మాట్లాడుతూ, మినిమం పెన్షన్ కోసం సమిష్టిగా పోరాటం చేస్తే సాధించుకోగలగమన్నారు. కణితి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నమ్మి అప్పలనాయుడు, మంత్రి గోపి, మేడిశెట్టి వెంకట్రావు, అప్పారావు, నక్క అప్పారావు, ఎన్వి.రమణ, పులి రాము, డి.గురునాథ్, వెంకయ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కేర్లో 10 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు



రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల్లో పాల్గొన్న కేర్ వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేర్ ఆసుపత్రిలో కేవలం 12 గంటల్లో 10 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని, ఆంధ్రప్రదేశ్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల్లో మరో మైలు రాయిగా భావిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఒకే రోజు ఒకే సర్జన్ ద్వారా ఇన్ని మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు జరగడం ఆంధ్రప్రదేశ్లో ఇదే తొలిసారి అని కేర్ వైద్యులు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సర్జికల్ మారథాన్కు చీఫ్ రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జన్ డాక్టర్ రవిచంద్ర నాయకత్వం వహించారని, ఈ శస్త్ర చికిత్సల్లో డాక్టర్ రఘు యలపర్తి, డాక్టర్ రాజు నాయుడు, డాక్టర్ అజయ్, కీలక పాత్ర పోషించారని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిచంద్ర వట్టివల్లి మాట్లాడుతూ, రోబోటిక్ టెక్నాలజీతో శస్త్రచికిత్స ఇంకా ఖచ్చితంగా రోగులకు అనుకూలంగా మారిందన్నారు. కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయాఖ్ చౌదరి మాట్లాడుతూ, ఈ సర్జరీ విజయం మరోసారి కేర్ ఆసుపత్రి వైద్య నిపుణతను, ఆధునిక చికిత్సల పట్ల నిబద్ధతను నిదర్శనంగా నిలిపిందన్నారు. ఇంతటి పెద్ద శస్త్రచికిత్స విజయవంతం కావడంలో రోబోటిక్ టెక్నాలజీ, ఖచ్చితమైన ప్రోటోకాల్స్, అనుభవజ్ఞులైన ఆర్థోపెడిక్ వైద్యుల సమిష్టి కృషి కీలక పాత్ర పోషించాయని తెలిపారు.

లొడగలవానిపాలెంలో గ్రామ స్వామిత్వ సభ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం గ్రామంలో గ్రామ స్వామిత్వ గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమునిపట్నం డివిజనల్ ల్యాండ్ డెవలప్మెంట్ అధికారి నిర్మలాదేవి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలోని గ్రామ కంఠం, ఎగ్జిస్టింగ్ ఇండ్ల వివరాలు, వాటి కొలతలను నమోదు చేసి, ప్రతి ఇంటికీ ప్రాపర్టీ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు గ్రామ సభ ఆమోదం అవసరం కావడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ, ఎంపిటిసి రౌతు శ్యామల, బమ్మిడి ఉమా సూర్యనారాయణ, కృష్ణంనాయుడు, లొడగల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆనందపురం ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణ, పి4 సర్వేలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై చర్చించారు.

సమాజానికి ఉపయోగపడేలా రచనలు

ప్రజాశక్తి- సీతమ్మధార : సమాజానికి ఉపయోగపడేలా కథలు రచనలు అందించిన వ్యక్తి ప్రముఖ రచయిత ఎంవివి.సత్యనారాయణ అని నాగార్జున యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ వి.బాలమోహన్దాస్ కొనియాడారు. పౌర గ్రంథాలయంలో ఎంవివి సత్యనారాయణ స్మారక పురస్కార సభ మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా బాలమోహన్దాస్ మాట్లాడుతూ, పోలీస్ అధికారిగా ఉద్యోగం చేస్తూ తన అనుభవాలను ప్రజలకు అందించిన వ్యక్తి సత్యనారాయణ అన్నారు. ప్రస్తుత రోజుల్లో పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు నేర్పించాలన్నారు. తద్వారా భావితరాలకు కథలు, రచనలపై అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. సత్యనారాయణ పేరు మీద ప్రముఖ రచయితలు గ్రంథం నాగేశ్వరరావు, వెంకట సత్యనారాయణకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రచయితలు రాజేశ్వరరావు, ఎన్కె.బాబు, మేడ మస్తాన్రెడ్డి, లీడర్ రమణమూర్తి, కవులు రచయితలు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, వాటిని అరికట్టించాలని కోరుతూ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మంగళవారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి వినతిపత్రం అందజేశారు. సింధియా నుంచి గాజువాక డిపో వరకు ఈ విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. సులబ్ కాంప్లెక్స్లో కూడా ఈ విక్రయాలు జోరుగా సాగుతున్నాయని తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని కోరారు.

నిరాశ్రయులకు ఆహారం

ప్రజాశక్తి- వేపగుంట: ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు జన్మదిన సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం బస్ స్టాప్లోనూ, రోడ్డు పక్కన ఉన్న నిరాశ్రయులు 500 మందికి ఆహారం, తాగునీటిని అందించారు. నాయుడుతోట, వేపగుంట, గోపాలపట్నం, కంచరపాలెం, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులను గుర్తించి అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఈశిత, ఆర్ విజయ, కె.వరలక్ష్మి, పిఐఎస్.రాజు, బి.రమేష్, ఉమామహేశ్వరరావు, టి.కేశవరావు, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లపై ప్రజాగ్రహం



అనకాపల్లి ఎపిఇపిడిసిఎల్ డిఇ కార్యాలయం వద్ద...

★ విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ధర్నాలు

★ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్



పెదగంట్యాడ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ప్రజాగ్రహం పెల్లుబికింది. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నాలు నిర్వహించారు.

సీతమ్మధార : స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, ఐద్వా, ఎన్ఐఎఫ్‌డబ్ల్యు, పిఒడబ్ల్యు, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, కెవిపిఎస్ తదితర ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన మంగళవారం భారీ నిరసన ధర్నా చేపట్టాయి. ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్.అచ్యుతరావులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లోకనాధం మాట్లాడుతూ,



కశింకోట ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ కార్యాలయం వద్ద..

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ కంపెనీలను అదాని లాంటి బహుళజాతి సంస్థలకు కట్టబెడుతుంటే రాష్ట్రంలోని కూటమి పెద్దలు దానికి సహకరించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజల సంపదను లూఠీ చేయడమే కాకుండా ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరైందికాదని హెచ్చరించారు. ఇదే చంద్రబాబు నాయుడు 2000 సంవత్సరంలో భారీగా విద్యుత్ చార్జీలు పెంచితే నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టారని తెలిపారు. అప్పట్లో చలో హైదరాబాద్ నిర్వహించితే చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురిని పొట్టన పెట్టుకుందని గుర్తుచేశారు. ఇప్పుడు మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రెహ్మాన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలుకొట్టండని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ చెప్పాడని, మరి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దొంగచాటుగా మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని



కె.కోటపాడులో...

ప్రశ్నించారు. పేద, సామాన్య ప్రజల ఆదాయాలు పెరగక, ఉపాధిలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పిఒడబ్ల్యు నాయకులు లక్ష్మి, ఎఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు వేయబోమని, స్మార్ట్‌మీటర్లు బిగించబోమని ప్రజలకు హామీ ఇచ్చి నేడు వాటిని అమలుచేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ప్రజా సంఘాల నాయకులు వై.సత్యవతి, వనజాక్షి, వై.రాజు, అచ్యుతరావు, పి.మణి, బి.జగన్, ఒ.అప్పారావు, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, ఎం.పైడిరాజు, మన్మధరావు, బొట్టా ఈశ్వరమ్మ, కుమారి, కొండమ్మ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎఇ బి.రవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, సి హెచ్ నరసింహులు, ఎం.వీర్రాజు, గోవిందరావు పాల్గొన్నారు.


గాజువాక : సిపిఎం స్టీల్‌జోన్ కమిటీ ఆధ్వర్యాన పెదగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం స్టీల్‌జోన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసేవరకు సిపిఎం పోరాటం



ఎస్.రాయవరం మండలంలో...

కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ధర్నా అనంతరం ఎఇకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రామారావు, డి.వెంకటరావు, బి.గురప్ప, నమ్మి రమణ, టివికె.రాజు, మహేష్, కెవి.సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, సిహెచ్.రాముడు, హెచ్.భానోజీరావు, కొవిరి అప్పలరాజు, కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

పరవాడ : స్మార్టు మీటర్లు బిగించవద్దని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ అదానీ విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అవే మీటర్లు బిగించడం నమ్మక ద్రోహమే అవుతుందన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లకు ఒప్పందాలు చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను కట్టబెట్టిందని, ఇందులో భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించిన కూటమి ప్రభుత్వం కూడా పదివేల కోట్ల కుంభకోణానికి



చోడవరంలో..

పాల్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుండలో తొక్కి ఈ సంవత్సరంలో 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీలను అదనంగా కూటమి ప్రభుత్వం మోపిందని తెలిపారు. మొత్తం 4రకాల సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) వసూలు చేస్తున్నారని, దీంతో బిల్లులు అధికంగా వస్తున్నాయని చెప్పారు. స్మార్ట్ మీటర్లు బిగించిన షాపులు, చిన్న పరిశ్రమలకు విద్యుత్ ఛార్జీలు రెండు, మూడు రెట్లు, కొందరికి 10 రెట్లు అదనంగా ఛార్జీలు పెరిగాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి రమణ, పి.మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా నాయకులు ఎం.బంగారమ్మ, టి.అన్నపూర్ణ, డి సీతమ్మ, కే సాయి వేణి, డి నాగదేవి, ఎస్కే బేగం, గౌరీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి ఎపిఇపిడిసిఎల్ డిఈ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని, గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, షాపులు, సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వైఎన్ భద్రం, సిపిఎం, సిపిఐ నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, బొప్పే ఉమా మహేశ్వర రావు, కాళ్ళ తేలయ్యబాబు, జి. సుభాషిణి, కోరిబిల్లి శంకరరావు, కొణతాల రామకృష్ణ, భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, టి.సురేషు, చలపతి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సబ్ స్టేషన్ వద్ద మంగళవారం సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం అసిస్టెంట్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయన బాబు, మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు. సీముసిరి రాము, వడసల



రాంబిల్లి మండలంలో...

వెంకటేష్, అప్పారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని కొరుప్రోలు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్ల వద్ద మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహంచారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం సత్యనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కోన మోహన్‌రావు, ఎల్ శ్రీనివాసరావు, వి.నాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎఐఎఫ్టియు న్యూ), నవయువ సమాఖ్య (ఎన్.వై.ఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెండు సంఘాల నాయకులు ఎన్.భాస్కర్, అయితిరెడ్డి అప్పలనాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఓ.లక్ష్మీ కుమారి, కసిరెడ్డి గౌరీ శంకర్, ఏడువాక రాజు, షేక్ రహీం, కొండబాబు, యు.కన్నయ్యమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్చుతాపురం విద్యుత్ సబ్‌స్టేషన్



అచ్యుతాపురంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సబ్ స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే సోమునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా కార్యదర్శి కే రామ సదాశివరావు, ముఠా సంఘం నాయకులు ఆర్ సత్తిబాబు, ఆటో యూనియన్ నాయకులు నాయుడు, యువజన సంఘం నాయకులు గంగరాజు, మహిళా సంఘం నాయకులు ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

రాంబిల్లి : సీఐటీయూ ఆధ్వర్యంలో రాంబిల్లి సచివాలయం వద్ద నిరసన కార్యాక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ ఇప్పటికే కరెంటు చార్జీలు, ట్రూఅప్, సర్ చార్జీల పేరుతో ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తున్న ప్రభుత్వం, స్మార్ట్ మీటర్లతో ప్రజల జీవితాలను నాశనం చేయడానికి చూస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడునాయుడు, నారాయణరావు, కాశి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జంక్షన్ నుండి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఎపిఇపిడిసిఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిఎల్‌వి. నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, సి.ఐ.టి.యు. జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.సత్తిబాబు, కె.నాగరాజు, బెన్నయ్య, బి.నూకరాజు, ఎం.అప్పల స్వామి నాయుడు, గోవింద, నూకు నాయుడు, బలరాం, ఎం. అప్పారావు, వినియోగదారులు పాల్గొన్నారు.

మాడుగుల : గ్రామాల్లో ఆదానీ స్మార్ట్ మీటర్లను ఇంటికి



మాడుగుల మండలంలో...

బిగించ వద్దని సిపిఎం నాయకులు ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేపట్టారు. మంగళవారం మాడుగుల మండలం శంకరం పంచాయితీ బొడ్డరేవు గ్రామంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు కె.భవాని. కొర్రా దేవదాసు, నాగార్జున, విజయశాంతి, నాగేశ్వరరావు, చిన్నారావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చీడికాడ : స్మార్ట్ మీటర్ల ను బిగిస్తే పోరు తప్పదని సిపిఎం.ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. మండలంలోని కోణాం పంచాయతీ కొండ్లకొత్తూరు, చినకోణాం గ్రామాలలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ గిరిజనులు నిరసన చేపట్టారు. కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు.

రావికమతం : .స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పీ.కొట్నాబిల్లి, అజయ్పురం, చీమలపాడు తదితర గ్రామాలలో పాదయాత్ర చేస్తూ ఇంటింటా కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు, పాంగి చంద్రయ్య, సింగారపు వరసయ్య, పాడి బెన్నయ్య పాల్గొన్నారు.



చీడికాడ మండలంలో..

రాము కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్ తీగల తగిలి విద్యాదాఘాతానికి మృతి చెందిన దూది రాము కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. చోడవరం మండలం గాంధీ గ్రామం సిటిజన్ కాలనీకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు దూది రాము తన ఇంటిపై ఉన్న హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు రాము ఆయన కుటుంబాన్ని సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్‌వి నాయుడులు మంగళవారం పరామర్శించారు. మృతుడు రాముకు భార్య, ఐదేళ్ల పాప ఉన్నారని, పెద్దదిక్కును కోల్పోయిందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విద్యుత్ హై టెన్షన్ వైర్లు కారణంగా మతి చెందిన రాము కుటుంబాన్ని భవననిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదానికి కారణాలపై విచారణ జరిపించాలని కోరారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని తురకలపూడి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఓటీ, లేబర్ గది, ఫార్మసీని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు, మందుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గర్భిణీలకు డెలివరీలను పెంచేవిధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పిఎసిఎస్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని కొరుప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. చైర్మన్‌గా తిమ్మాపురం గ్రామానికి చెందిన గుర్రం రామకృష్ణ, డైరెక్టర్లుగా గెడ్డపాలెం గ్రామానికి చెందిన దుబాసి రమాదేవి, కోనవానిపాలెం గ్రామానికి చెందిన కోన అప్పలరాజులు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కొరుప్రోలు గ్రామదేవత నూకాంబికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ రామకృష్ణను, డైరెక్టర్లు అప్పలరాజు, రమాదేవిలను మాజీ ఎంపిపి వినోద్ రాజు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బుల్లిచంటి, టిడిపి జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులు కొప్పిశెట్టి వెంకటేష్, స్థానిక నాయకులు ప్రత్తిపాటి పెదసత్తిబాబు, పుట్టా సుధాకర్, గ్రామ వైస్ సర్పంచ్ కొరపాటి గోపాలం, రైతులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : మానవాళి మనుగడకు పెను సవాళ్ళు విసురుతున్న రసాయన ఉత్పత్తులతో వ్యవసాయం సరికాదని ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి సరోజిని అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎండపల్లి గ్రామం వద్ద మంగళవారం ప్రకృతి వ్యవసాయం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆత్మ టెక్నాలజీ మేనేజర్ పి.సత్యవేణి ప్రకృతి వ్యవసాయానికి జీవామృతం ఘనామృతం, వేప గింజల కషాయం గురించి క్లుప్తంగా వివరించారు. వీటి ద్వారా పండిన ఆహారాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఆర్థికంగా లాభం చేకూరుతుందని తెలిపారు, కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రమణమ్మ, రవి, ప్రభావతి, సుదర్శన్, నాగ గోవిందు పాల్గొన్నారు.

పశుగ్రాసం ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పశు గ్రాసం ఉత్పత్తులను ప్రోత్సహించాలని విశాఖపట్నం జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం అనకాపల్లి మండలం గవరపాలెం వెటర్నరీ డిస్పెన్సరీని, మార్టూరులోని గ్రామీణ పశువైద్య కేంద్రంలో ఆయన విస్తృత తనిఖీలు చేశారు. అన్ని రికార్డులు, స్టాక్ పుస్తకాలు, డిస్పెన్సరీలో అందించబడిన వైద్య సేవల వివరాలను సమీక్షించారు. సంకరజాతి పశువులకు ప్రస్తుతం జరుగుతున్న థైలేరియాసిస్ టీకా కార్యక్రమం, పశువుల పెంపకందారుల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించడానికి నిర్వహిస్తున్న బ్లాంకెట్ సర్వే గురించి, లింగ-విభజిత వీర్యం వాడకం, ప్రయోజనాలు, లభ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసం ఉత్పత్తిని ప్రోత్సహించాలని డాక్టర్ చంద్ర శేఖర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గవరపాలెం పశువైద్య అధికారి డాక్టర్ అనీల్ కుమార్, జేవీవో వసంత, నిర్మల, సిబంది పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు నిలుపుదల చేయాలని నిరసన



వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం, సిఐటియు నేతలు

ప్రజాశక్తి-మునగపాక : నీటి తీరువా వసూలు తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ మండలంలోని వెంకటాపురం గ్రామ సచివాలయం ఎదుట మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విఆర్‌ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల వ్యవసాయ భూములకు చెరువుల్లోనూ కాల్వలలోనూ నీరు నిల్వ లేదని, రైతులకు నీరేపారలేనిది నీటి తీరువ వసూలు ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. నీటి తీరువా కట్టాలని రెవెన్యూ అధికారులు డిమాండ్ నోటీస్‌లు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా వెంకటాపురం మెట్ట ప్రాంతమని, ఈ గ్రామంలో చెరువులు, కాలువలపై ఆధారపడి ఒక ఎకరా కూడా సాగు జరగడం లేదని, దీనిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించాలని కోరారు. వ్యవసాయానికి కనీసం మూడు నెలల పాటు నీరు కాలువలు, చెరువుల ద్వారా నీరు అందిస్తేనే నీటి తీరు వసూలు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ వాటిని అధికారులు పట్టించుకోకుండా రైతులపై భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి తీరువ వసూలు నిలుపుదల చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కడియం దివాకర్, సుందరపు రామకృష్ణ, చిన్ని రామారావు, నక్కరాజు సత్యారావు, కన్నం రామకృష్ణ, పసుపురెడ్డి మోహన్, చిన్ని రామానాయుడు, బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- వడ్డాది : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉండగానే రాష్ట్రంలో ఉన్న అన్ని సహకార సుగర్ ఫ్యాక్టరీలు మూతబడ్డాయని గుర్తు చేశారు. తమ వైసీపీ ప్రభుత్వంలో జగన్ రూ.89 కోట్లు గ్రాంట్ విడుదల చేసి గోవాడ ఫ్యాక్టరీని కాపాడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత సీజన్లో కేవలం లక్ష టన్నులు క్రషింగ్ మాత్రమే చేసిందని, ఆరేడు నెలలు కావస్తున్నా రైతులకు నేటికీ పేమెంట్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. కనీసం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ జనరల్ బాడీ మీటింగ్ కూడా నిర్వహించలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. అనకాపల్లి రూరల్ జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ కూటమి ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని, ముఖ్యంగా బిఎన్ రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ.32కోట్లతో కేబీ రోడ్డు నిర్మించామని, ఇప్పుడు కేబీరోడ్డే అందరికీ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా నారాయణ మూర్తి, గొంపా చినబాబు, మండల వైసీపీ అధ్యక్షులు అచ్చం నాయుడు, జోగా కొండబాబు, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధన్‌రావు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై అవగాహన : ఎస్‌పి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-మునగపాక : గ్రామస్థాయిలో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పెండింగ్ కేసులో దర్యాప్తు స్థితిని సమీక్షించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సీసీ కెమెరాలు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘాను పెంచాలని కోరారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తదితర అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత, మహిళా చట్టాలపైనా, శక్తి యాప్ వినియోగంపైనా విద్యార్థినులు, మహిళలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరవాడ ఇన్‌ఛార్జి డిఎస్‌పి బి.మోహనరావు, ఎలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధనుంజయరావు, మునగపాక ఎస్సై పి.ప్రసాదరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి-సబ్బవరం : పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలంలోని కూటమి నాయకులు నియమితులయ్యారు. మండలానికి చెందిన నల్లరేగులపాలెం మాజీ సర్పంచ్, సీనియర్ టిడిపి నేత కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు, గొట్టివాడ పంచాయతీకి చెందిన మాజీ ఎంపిటిసి బొండా కళ్యాణ్ రాజ్, సబ్బవరానికి చెందిన రెడ్డి రామునాయుడు డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. వారిని పలువురు కూటమి నేతలు అభినందించారు.







కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు, బొండా కల్యాణ్‌రాజ్, రెడ్డి రామునాయుడు

ఉత్తమ సహకార సంఘంగా సిహెచ్.ఎన్.అగ్రహారం పిఎసిఎస్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ప్రకటించిన ఉత్తమ సహకార సంఘాల్లో అనకాపల్లి మండలం చింతనిప్పుల అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఉత్తమ సహకార సంఘం అవార్డు దక్కింది. ఈ మేరకు విజయవాడలో ఈనెల 4న రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు, రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మధుసూదనరావు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో మధుసూదన రావు మాట్లాడుతూ తమ పిఎసిఎస్ ఏర్పడి 62 సంవత్సరాల చరిత్రలో అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి మెయిన్ స్కూల్‌లో సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబర్ 1న చలో విజయవాడ పేరిట నిర్వహించనున్న సిపిఎస్ ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. గందరగోళంతో ఉన్న జిపిఎస్, సిపిఎస్‌లను రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు బి.శ్రీనివాసరావు, చిరికి సింహాచలం నాయుడు, అవుగడ్డ కృష్ణ స్వామి నాయుడు, ఎస్.లక్ష్మణరావు, నౌడు అప్పారావు, కొటాన రాంబాబు పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణతో సంపద : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఘన వ్యర్థాల నిర్వహణతో పర్యావరణం బాగుపడటంతో పాటు, పునర్వినియోగం ద్వారా సంపద సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మండలంలోని మార్టూరు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఘనవ్యర్థాలు నిర్వహణపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటిలోని చెత్తను తడి పొడి చెత్తగా విడదీసి అందించేలా అవగాహన కల్పించాలని కోరారు. ఘన వ్యర్థాలను పునర్వినియోగానికి వినియోగించే విధంగా వేరుచేసి అందజేయాలని సూచించారు. తద్వారా పరిసరాలు శుభ్రంగా ఉండడంతో పాటు, ఘనవ్యర్థాలు మూలంగా గ్రామపంచాయతీలకు సంపద కూడా చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డివో నాగలక్ష్మి, ఎంపీడీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడి కార్డుల వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐడి కార్డులను గ్రామానికి చెందిన నాగల త్రినాథ్ సూర్య కళ దంపతులు తమ సొంత డబ్బులతో చేయించి అందజేశారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు సమక్షంలో ఐడి కార్డులను విద్యార్థులకు బహూకరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భారతి, ఆయా రూప, ఏపీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొండెంపూడిలో మరిడిమాంబ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని కొండెంపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయాన్ని మంగళవారం వైభవంగా ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ ఆది సత్తిబాబు, గ్రామ పెద్దలు ఆధ్వర్యాన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కేన్సర్ బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామపంచాయతీ శివారు గణపతి నగర్‌కు చెందిన నలమారి యుగంధర్ క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యుగంధర్ ఆర్థికంగా పేదవారు కావడంతో పెద్ద మొత్తంలో హాస్పటల్ ఖర్చుకు అవసరమైంది. జనసేన నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు విశాఖపట్నం ఒమేగా హాస్పిటల్లో చికిత్స పొందుతున్న క్యాన్సర్ పేషెంట్ యుగంధర్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఖర్చుపెట్టిన ప్రతి రూపాయి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి ప్రభుత్వం ద్వారా వచ్చే విధంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

జగదాంబ థియేటర్ అధినేత

రాంబాబు కన్నుమూత



వేగి రాంబాబు (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగదాంబ థియేటర్ అధినేత వేగి భద్రాచలం (రాంబాబు) కన్ను మూశారు. మంగళ వారం ఉదయం 8 గంటల సమయంలో రాంనగర్ రాక్ డే హోటల్ వెనుక భాగంలోని తమ గృహంలో ఆయన తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంబాబు మరణం పట్ల పలువురు పెద్దలు, సినీ అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాంబాబు మృతి చెందడంతో జగదాంబ థియేటర్, శారద, రమాదేవి థియేటర్లలో షోలను బంద్ చేశారు. రాంబాబు అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంబాబుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మహా నగరంగా రూపుదిద్దుకున్న విశాఖ నగర చరిత్రకు కొండ గుర్తుగా నిలవటం జగదాంబ థియేటర్ ప్రత్యేకత. చలనచిత్ర గమనంలో విశాఖ జగదాంబ థియేటర్ ఒక మైలురాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి 70 ఎంఎం థియేటర్ జగదాంబ. దీన్ని తెలియని సినీప్రేమికులు ఉండరంటే అతిశయోక్తి కాదు. అంతలా ప్రాచుర్యం పొందిన జగదాంబ థియేటర్‌కు ఇటీవల ఉత్తమ సింగిల్ స్క్రీన్ ఆఫ్ ఇండియా అవార్డు 2025ను ప్రకటించారు. నగరంలోని ఎల్లమ్మ తోట ప్రాంతంలో 4200 చదరపు అడుగుల విస్తీర్ణంలో చెన్నైకి చెందిన ప్రముఖ నిర్మాణ నిపుణుడు కెవెన్.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఈ థియేటర్ నిర్మించారు. 70 ఎంఎం ప్రదర్శన వ్యవస్థను కనుగొన్న ఎఒ టాడ్ సూచనల మేరకు రాంబాబు ఈ థియేటర్‌ను నిర్మించారు. దీనిలోని వలయాకార ర్యాంపు ఆ రోజుల్లో ఓ విశేషం. 12 వందల సీటింగ్ కెపాసిటీతో ఉన్న ఈ థియేటర్‌ను 1970 అక్టోబర్ 25న అప్పటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జెవి.నర్సింగారావు ప్రారంభించారు. ఆంగ్ల చలన చిత్రాలు అంటే మక్కువ కలిగిన రాంబాబు 'వేర్ ఈగిల్స్ డేర్' అనే ఆంగ్ల చిత్రంతో తొలి ఆటను ప్రారంభించారు. జగదాంబ థియేటర్‌లోని శబ్ద వ్యవస్థకు దశాబ్దాలు దాటినా నేటికీ పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. అనంతర కాలంలో జగదాంబ ప్రాంగణంలో శారద, రమాదేవి థియేటర్లను నిర్మించారు. దీంతో విశాఖ నగరంలో తొలి మల్టీప్లెక్స్‌గా జగదాంబ థియేటర్ నిలిచింది. రాంబాబు తండ్రి వేగి వీరు నాయుడు అనకాపల్లి జిల్లా మునగపాక మండలం గంగాదేవిపేట గ్రామానికి చెందినవారు. వ్యాపార రీత్యా విశాఖపట్నం వచ్చి స్థిరపడ్డారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల సచివాలయంలో ఇటీవల బదిలీ అయిన ఉద్యోగులను సర్పంచ్ అల్లు పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. సచివాలయంలో బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను ఆహ్వానించి, వారందరికీ పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అల్లు రమణ, గోవింద్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, గ్రామ పెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జి.కోడూరు క్వారీ రద్దు కోరుతూ

దళిత రైతుల వినూత్న నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలతో దళిత రైతుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మాకవరపాలెం మండలం జి.కోడూరులోని రాళ్ల క్వారీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు 14 రోజులుగా నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రిలేదీక్ష చేపడుతున్నారు. అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు, ముఖ్యంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ సమస్యను పట్టించుకోక పోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం దళిత రైతులు ఆందోళనను ఉధృతం చేశారు. కళ్లకు గంతలు కట్టుకొని ఆర్‌డిఒ కార్యాలయం దరి దీక్షా శిబిరం నుండి ఎన్టీఆర్ స్టేడియంలో వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ గాంధీ విగ్రహం ముందు నినాదాలతో నిరసన తెలిపారు. అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు మాట్లాడుతూ వైసిపి, టిడిపి, జనసేన, బిజెపిలకు దళితులు, బిసిలు, పేదల ఓట్లు కావాలే తప్ప, వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత ఉండదా అని ప్రశ్నించారు. క్వారీ రద్దు విషయంలో స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రద్దు చేయాలంటే రంగంలోకి వచ్చి మద్దతు పలకాలని, లేకుంటే, మైనింగ్ దళారులకు సహకరిస్తున్నారని భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. ..కాంగ్రెస్ నాయకుడు బొంతు రమణ మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు భారీ వాహనాలు వెళ్లకూడదు చెక్‌పోస్టులు, ఇతర ఏర్పాట్ల గురించి మాట్లాడుతున్నారే తప్ప, క్వారీ నుండి వచ్చే వాహనాలు కూడా అదే రూట్‌లో వస్తున్నాయని తెలుసుకోవాలన్నారు. ముందు క్వారీని ఆపితే చెక్‌పోస్టుల అవసరం ఉండదని వెంటనే క్వారీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తాము ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని స్పష్టం చేశారు. .క్వారీ బాధిత రైతు అప్పారావు మాట్లాడుతూ, అధికారులు, ప్రభుత్వం, స్పీకర్, ఎవ్వరూ తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు మట్ల చంటి, సిపిఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి, బాధిత రైతులైన అప్పారావు, లోవరాజు, కళ్యాణం, పెంటయ్య, మారిసు, నాగభూషణం, పెద్ద సంఖ్యలో మహిళలు, పిల్లలు, వద్దులు పాల్గొన్నారు. అధికారులు ఈ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే తీవ్ర నిరసనలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

ప్రమాదభరిత విద్యుత్ వైర్లకు

విరాళాలతో మరమ్మతులు

చేదోడుగా నిలిచిన స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేట పంచాయతీ కేంద్రంలో చేతికందేలా వేలాడుతున్న విద్యుత్‌వైర్లను స్థానికులే స్వచ్ఛందంగా విరాళాలు చేసుకుని సరిచేసుకున్నారు. దీనికి స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు తనవంతుగా సాయం అందించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వివరాలివి. లింగంపేటలో వేలాడుతూ, ప్రమాదభరితంగాచ ప్రాణాపాయంగా ఉన్న విద్యుత్ వైర్ల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కొన్నాళ్లుగా మొరపెట్టుకుంటునే ఉన్నారు. దీనిపై సంబంధిత విద్యుత్‌శాఖగానీ, గ్రామపంచాయతీ, ఇతర శాఖలు పట్టించుకున్న పాపాన పోలేదు. గతేడాది అక్టోబర్‌లో దీనిపై విన్నవించగా, విద్యుత్‌శాఖ అధికారులు అంచనా ప్రతిపాదనలు వేసి, పదినెలల క్రితం రూ.18వేలు చెల్లించాలని సూచించారు. ఈ నిధులను పంచాయతీ నుంచి చెల్లించేందుకు పంచాయతీ కార్యదర్శి ముందుకు వచ్చినప్పటికీ, స్థానిక సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో చెల్లించని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ వైర్లను సరిచేసేందుకు పంచాయతీ నిధులను చెల్లిస్తే తన చెక్‌పవర్ పోతుందని సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో చేసేది లేక గ్రామస్తులంతా చందాలు వేసుకుని నిధులు సమీకరించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు కూడా వారికి సహకరించడంతో విద్యుత్ శాఖ సూచించిన రూ.16వేలను చలానా కట్టి సమర్పించారు. ప్రభుత్వం ,అధికారులు, చివరకు గ్రామపంచాయతీ కూడా ప్రజల ప్రాణాలు పోతున్నాయి, సమస్యను పరిష్కరించడని మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో చివరకు గ్రామస్తులే విరాళాలు సేకరించి పనిచేసుకోవాల్సిన దుస్థితి కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి.

చీడపీడల నియంత్రణతో నాణ్యమైన దిగుబడి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి -నక్కపల్లి :కొబ్బరి సాగులో చీడపీడల నియంత్రణతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని బిసిటి, కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త, బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలో జానకయ్యపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా కొబ్బరిలో చీడపీడల నివారణ, కాయలు రాలిపోకుండా బోరాన్ పోషక యాజమాన్యం, తెల్ల దోమ నియంత్రణ గురించి వివరించారు.రైతులందరూ సమిష్టిగా యాజమాన్య చర్యలు చేపట్టడం ద్వారా చీడపీడలను సకాలంలో నియంత్రించ వచ్చునని అన్నారు.అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ఈ- పంట నమోదు, వ్యవసాయ యాంత్రీకరణ తదితర ప్రభుత్వ పథకాలతో జరిగే మేలు, వాటి నమోదు కోసం అవసరమైన వివరాలను వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమారి వివరించారు.చీడపీడల యాజమాన్యంతో పాటు గ్రామ అభివృద్ధికై సామూహికంగా గ్రామస్తులందరూ చేపట్టదగిన చర్యల గురించి, ముఖ్యంగా కోతుల బెడద నియంత్రణ,సామూహిక అటవీ సాగు గురించి చర్చించారు.ఈ కార్యక్రమంలో కురందాసు సింహాచలం, చిన్నబ్బాయి,కురందాసు నూకరాజ, చిట్టిబాబు, రైతు సేవ కేంద్రం సిబ్బంది సత్యనారాయణ, కొండల రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పారావు, వరలక్ష్మి, మంగ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనానికి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణంలోని గబ్బాడ సెక్టార్‌లో గచ్చపు వీధి అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మాణానికి 5 సెంట్ల భూమిని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి కోరిక మేరకు తహశీల్దార్ మంజూరు చేశారని సిడిపిఒ జివి.రమణి తెలిపారు.మ ంగళవారం గచ్చపువీధిలో తల్లి పాల వారోత్సవాలలో ముఖ్య అతిథిగావచ్చిన కౌన్సిలర్ పద్మావతికి ఈ మేరకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని పద్మావతి ప్రారంభించారు. అంగన్వాడీలో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. లబ్ధిదారులకు ఇచ్చే స్టాక్ను తనిఖీ చేశారు తల్లి పాల ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ అంగన్వాడీ వర్కర్స్, సూపర్వైజర్స్, అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ డాక్టర్ ప్రశాంతి, డిపిఎంఒ డాక్టర్ చాందిని, డాక్టర్ నందిని పాల్గొన్నారు అనంతరం బలిఘట్టం, బొంతువారి వీధి, పిహెచ్‌సిల్లో ఫీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు.

మెరుగైన పశు వైద్యసేవలు అందించాలి



మొక్కలు నాటుతున్న వెటర్నరీ అధికారులు, నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : పశువైద్య సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని నర్సీపట్నం పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ డబ్బు రాంబాబు సూచించారు. మంగళవారం స్థానిక పశు వైద్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ముందుగా ఇటీవల బదిలీపై వచ్చిన సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాట్లాడుతూ, సీజనల్‌గా పశువులకు అవసరమైన టీకాలను ముందుగానే వేయడంతోపాటు పశువ్యాధులపై పాడిరైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గడిచిన నెలలో వెటర్నరీ సేవలపై ఎడి డాక్టర్ రాంబాబు వివరించారు. శిథిలావస్థలో ఉన్న గొలుగొండ పశు వైద్య కేంద్ర భవనాన్ని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఆర్‌జే.దుర్గాప్రసాద్ సొంత నిధులను వెచ్చించి మరమ్మతులు చేసి కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచిన తీరుపై వెటర్నరీ సహాయ సంచాలకులు, అడిగర్ల అప్పలనాయుడు ప్రశంసించి, అభినందించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కుబుషి చేస్తానని అప్పలనాయుడు హామీనిచ్చారు. అనంతరం పశు వైద్య కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు.కార్యక్రమంలో మండల పశు వైద్యులు డాక్టర్.దుర్గాప్రసాద్, డాక్టర్ సురేష్, డాక్టర్ శిరీష, పశు వైద్య సహాయక సిబ్బంది, డేటా ఆపరేటర్ గంగాధర్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగిపై దాడి

ఆందోళన చెందుతున్న ఇతర ఉద్యోగులు



ఆసుపత్రిలో వైద్యసిబ్బందితో గొడవ పడుతున్న వ్యక్తి

ప్రజాశక్తి -మాడుగుల : మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న ఓ ఉద్యోగిపై గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చి ంది. దీంతో స్థానిక ఆసుపత్రి లోని వైద్య ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 2న, శనివారం మధ్యాహ్నం మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలోఉద్యోగితో గ్రామానికి చెందిన వ్యక్తుల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలో సూపరింటె ండెంట్ లేకపోవడంతో సోమవారం ఆయన దృష్టిలో పెట్టి తగు చర్యలు తీసుకుందామని గ్రామస్తుని సర్దిచెప్పి ఇతర వైద్యసిబ్బంది పంపించేశారు. అయితే విధులు ముగించి ఇంటికి వెళుతున్న ఉద్యోగిపై సంబంధిత వ్యక్తి మరికొందరితో దాడికి పాల్పడ్డాడని వైద్యసిబ్బంది ఆరోపిస్తున్నారు. దీనిపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టి పెట్టి, ఉద్యోగులకు భద్రత, రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై సంబంధిత ఉద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మత్తుకు బానిసైతే జీవితం చిత్తు!

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థి సదస్సులో డిఎస్‌పి శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్. : డగ్స్, మాదక ద్రవ్యాలకు బానిసలై విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నర్సీపట్నం డిఎస్‌పి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల వద్ద 'యువత మేలుకో మత్తుకు బానిస కావొద్దు జీవితం నాశనం చేసుకోవద్దు' అనే అంశాలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. విద్యార్థినులపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ నేరమని, వీటికి పాల్పడి కేసులు పాలు కావద్దని హెచ్చరించారు.మహిళల రక్షణకు కఠిన చట్టాలు ఉన్నాయని, వాటిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శక్తియాప్, డయల్ 112 సేవలను వినియోగించుచోవాలని సూచించారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివి, ఉత్తమ ఫలితాలతో భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం నేరమని, దీనిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, గౌతమ్ మాట్లాడుతూ నర్సీపట్నంలో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని తమ విజ్ఞప్తి మేరకు డిఎస్‌పి కొన్ని ప్రాంతాలలో పోలీసుల నిఘా, పెట్రోలింగ్ పెంచడంపై ధన్యవాదాలు



ఎస్‌ఎఫ్‌ఐ సదస్సుకు హాజరైన విద్యార్థులు

తెలిపారు. సాయంత్రం కాలేజీలు విడిచిపెట్టే వేళల్లో శివపురం, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రతి ఒక్క కాలేజీ వద్ద పోలీసుల రక్షణ చర్యలు చేపడుతున్నారని అన్నారు. పెట్రోలింగ్ నిర్వహించడం వలన విద్యార్థులకు రక్షణగా పోలీసువారి నిలబడ్డారని కొనియాడారు.

నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ జి గోవిందరావు, రూరల్ సిఐ ఎల్ రేవతమ్మ మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎస్‌ఎఫ్‌ఐ సదస్సుకు పట్టణంలోని ప్రయివేటు, ప్రభుత్వ డిగ్రీకాలేజీలు, ఇతర కాలేజీలకు చెందిన దాదాపు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకులు. మోహన్ సాయి, ప్రవీణ్, సత్యనారాయణ, విష్ణు, లవ కుమార్, లింగమూర్తి, గణేష్, రాకేష్, శ్రీను, అభినయ, ఐశ్వర్య, ఇందు, రమ్య, చంద్రకళ, ప్రమీల, పద్మ, సావిత్రి పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన అతిథులు డిఎస్‌పి, సిఐలను కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజు సత్కరించారు

కల్యాణపులోవ నీరు విడుదల



రిజర్వాయర్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్ నుంచి సాగునీటిని చోడవరం ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు మంగళవారం విడుదల చేశారు. అంతకుముందు రిజర్వాయర్ వద్ద ఉన్నకల్యాణ పోతురాజు బాబు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, అనంతరం రిజర్వాయర్ వద్ద పూజలు చేసి, సాగునీటిని దిగువన ఉన్న ఆయకట్టుకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, ఖరీఫ్‌లో సాగుకు వీలుగా సాగునీటిని విడుదల చేశామని, రైతులు నీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం నిధులను విడుదల చేశాయని, వాటిని సాగు అవసరాలకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోమటి శంకర్రావు, మాజీ అధ్యక్షుడు కొండనాయుడు, పలువురు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఛిద్రమైన రోడ్డుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



శిథిలమైన పలకల స్థానే శ్లాబ్ రోడ్డు పనులు

ప్రజాశక్తి -నర్సీపట్నం : నర్సీపట్నం బస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇరువైపులా ఇన్, అవుట్ గేట్ల వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు బాగుచేసేందుకు మున్సిపల్ అధికారులు ముందుకు వచ్చారు. . బస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో రెండువైపులా కాలువపై ఉన్న సిమెంట్ పలకలు ఛిద్రం కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. దీనిపె 'ఇలా అయితే బస్ స్టేషన్ వెళ్లేదెలా?' అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై మున్సిపల్ శాఖ అధికారులు స్పందించారు. రూ.1.50 లక్షలు నిధులు మంజూరు చేసి పాడైన సిమెంట్ పలకలను తొలగించి, సిమెంట్ శ్లాబ్ వేస్తున్నారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి పనులు చేపట్టడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూముల రీసర్వే చేపట్టాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న వీరభద్రునిపేట గ్రామస్తులు

ప్రజాశక్తి - చీడికాడ : తమ గ్రామంలో రీసర్వే చేపట్టి, పూర్తిచేయాలని చీడికాడ మండలం వీరభద్రుని పేట గ్రామంలో కమ్యూనిటీ హాల్ వద్ద గ్రామ ప్రజలు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు గ్రామంలో రెవిన్యూ సమస్యలు ఎన్నో ఉన్నా ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంతో భూముల అమ్మాలన్నా, కొనాలన్నా, సాగు చేయాలన్న అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రీ సర్వే పూర్తి చేసి గ్రామంలోని భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో రీసర్వే చేపడితే,తాము అందుకు సహకరిస్తామని అంటున్నారు.

సమస్యల పరిష్కారానికి జర్నలిస్టుల నిరసన



నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం : వర్కింగ్ జర్నలిస్టులందరికీ కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు, హెల్త్ కార్డుల జారీ, ప్రమాదబీమా అమలు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలకు ఆర్థికసాయం, ఇతర ప్రయోజనాలను కల్పించాలని కోరుతూ జిల్లాలోని పలు మండలాల్లో ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. గొలుగొండలో నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

మాడుగులలో తహశీల్దార్ కే.రమాదేవికి వినతిపత్రం అందించారు. నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి, వినతిపత్రం అందజేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్‌మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. చోడవరంలో పాత్రికేయులు తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిటి వెంకట సాయికి వినతిపత్రం అందించారు. కె.కోటపాడులో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. బుచ్చయ్యపేటలో డిటి వై.శ్రీరామమూర్తికి, మునగపాకలో తహశీల్దారు సత్యనారాయణకు, దేవరాపల్లి డిప్యూటీ తహశీల్దారు కె..అప్పారావుకు, పాయకరావుపేటలో తహశీల్దారు ఎస్ఎ మహేశ్వరరావుకు పాత్రికేయులు వినతిపత్రాలు అందించారు.

సంక్షేమ బోర్డు, పథకాలు పునరుద్ధరించాలి

- సెప్టెంబర్ 15న చలో విజయవాడను జయప్రదం చేయండి
- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు



మహాసభ ప్రారంభంలో జెండా ఆవిష్కరణ చేసిన దృశ్యం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-రాంబిల్లి : రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జల్లా 5వ జిల్లా మహాసభ రాంబిల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకరరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసే మెమో 1214ను రద్దు చేయకపోవడంతో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు జరగలేదన్నారు. సంక్షేమ బోర్డు చట్టం ప్రకారం నిర్మాణదారుల నుండి ఒక శాతం లేబర్ పొన్ను వసూలు చేసి కార్మికులు సంక్షేమానికి ఖర్చు పెట్టాల్సి ఉందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలోనూ, నేటి కూటమి ప్రభుత్వ హయాంలోనూ సంక్షేమ బోర్డు పథకాల అమలు కాలేదన్నారు. పైగా సంక్షేమ బోర్డును రద్దు చేయడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సిద్ధమైందని, దీనికి వైసిపి, కూటమి పార్టీల ఎంపీలు గతంలోనూ, నేడు పార్లమెంట్లోనూ మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో గాక దేశంలోనే కోట్లాదిమంది భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు దూరం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ ఆమోదంతో కోట్లాది రూపాయలు ఆర్థిక భారం మోపుతుందని, స్మార్ట్ మీటర్లను బిగించి కార్మికులపై భారాలు వేస్తోందని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 15న చలో సంక్షేమ బోర్డు కమిషనర్ కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు, సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అడిగర్ల రాజు, జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, నాయకులు సిహెచ్ రామకృష్ణ సీరం రాంబాబు, నాగేంద్ర, ఎన్.నారాయణరావు, ధోని, కె. రాము, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయడానికి అవసరమైన మార్గదర్శులను ఎంపిక త్వరితగతిన చేసి మ్యాపింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మార్గదర్శులకు బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇందులో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ప్రణాళికా అధికారి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి లక్ష్యం సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అందరూ కృషి చేయాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వాలాబు పంచాయతీ రామన్నపాలెంకు చెందిన గర్భిణి గిన్నెల లక్ష్మీ మంగళవారం సాయంత్రం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. పురిటి నొప్పులతో దేవరపల్లి పీహెచ్సీకి వెళ్లిన ఆమెను, మెరుగైన చికిత్స కోసం కె.కోటపాడు సిహెచ్సీకి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ఏ.కోడూరు వద్ద నొప్పులు తీవ్రమవడంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారు. గర్భిణిని ధైర్యంగా ఆదరించి సురక్షితంగా ప్రసవం జరిపించిన 108 సిబ్బందిని అభినందించారు.